బృందావనం

మొక్కలతో మమేకం.. అదే వ్యాపకం.. అదే జీవితం

- ఇంటినే వ్యవసాయ క్షేత్రంగా మార్చేసిన **ఐశ్వర్య**
- సేంద్రియ **పద్ధతిలో పండ్లు**, పూల మొక్కల పెంపకం
- వరించిన **అవార్డులు**



ఆ ఇంట్లో అడుగు పెడితే చాలు పూల పరిమళాలు సాదర స్వాగతం పలుకుతాయి. మేడపైకి వెళ్తే పండ్ల మొక్కలు ఆహా అనిపిస్తాయి. వంటకు మేం సిద్ధం అంటూ తాజా కూరగాయలు.. పోషక విలువలు పెంచే పండ్లు పలకరిస్తాయి. బృందావనం లాంటి ఆ ఇంటిని దర్శిస్తే మనసు పులకరించిపోతుంది.

– పెదగంట్యాడ

వికసిస్తున్న అరుదైన పూలు

ఈ ఇంట్లో ప్రతి రోజూ అరుదైన పూలు వికసిస్తున్నాయి. నిత్యం పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆకుపచ్చ చామంతి (గ్రీన్ చామంతి), ఆకుపచ్చ మందారం (గ్రీన్ మందారం), మినీ కదంబం, ఆకుపచ్చ విరజాజి, పింక్ లోటస్ పూల మొక్కలతో పాటు గులాబీ, పసుపు చామంతి, జాజి, మల్లి, మందారం వంటి మొక్కలు పెంచుతున్నారు.





రకరకాల కూరగాయలు

ఇక్కడ వంకాయలు 8 రకాలు ఉన్నాయి. అందులో థాయ్ రిబ్డ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే పిచ్చుక పొట్ల (పొట్లకాయ)తో పాటు టమాటాలు 13 రకాలు, బెండకాయలు నాలుగు రకాలు. అందులో డబుల్ షేడ్, ఏనుగు దంతం, కస్తూరి బెండ, చెట్టు బెండ విరగ్గాస్తున్నాయి. మిరపకాయలు బ్లాక్, డబుల్ కలర్, ఎల్లో మిర్చి పండిస్తున్నారు. ఆనపకాయలను పోలి ఉండే చమ్మకాయలు (జుకినీ)ను కూడా ఇక్కడ పండించడం విశేషం

ఆమెకు మొక్కలంటే ప్రాణం..అదే వ్యాపకం. కాదుకాదు అదే జీవితం. ప్రతి నిత్యం మొక్కలతో మమేకమవుతున్నారు. ఇంటి పరిసరాలతో పాటు మేడ మీద వేసి పూలు, పండ్లు, కూరగాయలతో పాటు ఔషధ గుణాల మొక్కలు పెంచుతున్నారు మాచవరపు ఐశ్వర్య. మండలంలోని వుడా కాలనీలో ఐశ్వర్య దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త శ్రీనివాస్ వరప్రసాద్ స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి వీఆర్‌ఎస్ తీసుకున్నారు.. ఐశ్వర్య ఇంట్లో ఉంటూ మొక్కలే ప్రాణంగా చూసుకుంటున్నారు.

నోరూరించే పండ్లు

డ్రాగన్ ఫ్రూట్, కొండ మామిడి.. మామిడి, సపోట, 8 రకాల చెర్రీపండ్లు, గజ నిమ్మ, స్వీట్ లెమన్, టేబుల్ లెమన్, స్ట్రాబెర్రీలను సాగు చేస్తున్నారు. ఇండోనేషియా గోల్డెన్ బొప్పాయి పండ్లు నోరూరిస్తున్నాయి.



ఇండోనేషియా బొప్పాయిని చూపిస్తున్న ఐశ్వర్య

పట్టుదలతో...

మామూలుగా పంటలు పండించాలంటే సారవంతమైన నేల కావాలి. అందుకు అవసరమైన ఎరువులు.. కావాల్సినంత నీరు ఉండాలి. ఇవి ఏమీ లేకున్నా.. ఇంటినే పంట భూమిగా తయారు చేసి రకరకాల ఔషధ గుణాల మొక్కలు, పండ్లు, కూరగాయలు, పువ్వులు పండిస్తూ అన్నదాతలకే ఆదర్శంగా నిలుస్తున్నారు ఐశ్వర్య.

ఆరోగ్యాన్ని పెంచే ఔషధ మొక్కలు

ఆరోగ్యాన్ని పెంచే ఔషధ గుణాలు ఉన్న మొక్కలు ఇక్కడ పలు రకాలు ఉన్నాయి. కర్పూరం, వావిలాకు, పసుపు, నల్ల పసుపు, విష్వాక్, కొండ మామిడి వంటి మొక్కలు సాకుతున్నారు.



ఇంటికి అలంకరణ.. ఆకర్షించేవి..

ఇక్కడ ఇంటిని అలంకరించి.. ఆకర్షించే మొక్కలు 185 రకాలు ఉన్నాయి. అందులో రాధామనోహర్ మొక్క కూడా ఉండడం విశేషం.

ఆకు కూరలూ ప్రత్యేకమే..

ఎర్ర తోట కూర, సిరి ఆకు, పింక్ తోటకూరతో పాటు 8 రకాల తులసి జాతులు ఉన్నాయి. అలాగే కంపోస్ట్ కోసం ప్రత్యేకంగా ఒక ఆకు కూరను పండిస్తున్నారు..

వృక్షాలుగా మొక్కలు

కుండీల్లో పెరగడం ఏమిటా అని ఆలోచిస్తున్నారా.. ఇవి బోన్సాయ్ మొక్కలు. పరిశీలిస్తే కాండం. కొమ్మలు కనిపిస్తాయి. ఇంటికి విచ్చేసిన చూపరులకు హాయిని ఇస్తాయి.

నేచర్ గార్డెనర్స్ గ్రూప్‌తో..

విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరానికి చెందిన 3 వేల మంది ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. వీరంతా కలసి నేచర్ గార్డెనర్స్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కవిత మూర్తి, అభిదునిస, అనురాధ, విరజశ్రీ, భవాని, మనోర్ మణి, స్వాతి, సౌజన్య, రాణి పలువురు కలసి మొక్కల విషయమై ప్రతి రోజూ ఈ గ్రూపులో సంప్రదింపులు జరుపుకుంటున్నారు. అరుదైన జాతులను సేకరించి ఒకరికొకరు పంపించుకుంటున్నారు. అలాగే విత్తనాలను కూడా తయారు చేసుకుంటున్నారు. ఎండిన ఆకులతో పాటు ఆహార వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేస్తున్నారు.

ప్లాస్టిక్‌కు గుడ్ బై

ఈ గ్రూప్ సభ్యులు ఎవరూ ప్లాస్టిక్ వినియోగించరు. మొక్కలతో పాటు విత్తనాలను పేపర్ కవర్లు, సొంత నిధులతో నేచర్ గార్డెనర్స్ పేరుతో గుడ్డ సంచులు కుట్టించుకుని ప్యాకింగ్ చేసి ఒకరికొకరు పంపించుకుంటున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పాఠశాలల్లో అవగాహన

నేచర్ గార్డెనర్స్ గ్రూప్ సభ్యులు వారు ఉండే ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు మొక్కల గురించి వివరిస్తున్నారు. వాటి పెంపకం.. సంరక్షణ, కంపోస్ట్ వంటి విషయాలను తెలియజేస్తున్నారు.

అవార్డుల పంట..

మాచవరపు ఐశ్వర్య మేడ మీద వంటతో అందరినీ ఆకట్టుకోవడంతో పాటు పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. అందులో రైతునేస్తం ఫౌండేషన్ ప్రతినిధి తుమ్మేటి రఘోత్తమరెడ్డి చేతుల మీదుగా 2023లో మిద్దె తోట పురస్కారాన్ని అందుకున్నారు. –వృక్ష మిత్ర కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ ట్రస్ట్ నుంచి 2023లో వృక్ష మిత్ర అవార్డు అందుకున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో మున్సిపల్ అధికారుల నుంచి కూడా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.



అరుదైన స్వీట్ స్టార్ ఫ్రూట్



మొక్కలతో మాచవరపు ఐశ్వర్య దంపతులు

మొక్కలంటే ప్రాణం

నాకు మొక్కలంటే ప్రాణం. చిన్న నాటి నుంచే మొక్కల పెంపకంపై ఆసక్తి ఉండేది. అరుదైన జాతులను తీసుకొచ్చి ఇంటి ఆవరణతో పాటు మేడపై పెంచుతున్నాను. కొత్త కొత్త వంగడాలను సృష్టిస్తున్నాను. నన్ను నా భర్తతో పాటు కుటుంబ సభ్యులు, మిత్రులు, మా గ్రూప్ సభ్యులు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.

–మాచవరపు ఐశ్వర్య, వుడా కాలనీ, పెదగంట్యాడ

క్లుప్తంగా

ఫెర్రోస్కాప్ ఉద్యోగులకు బోనస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఫెర్రోస్క్రాప్ ఉద్యోగులకు యాజమాన్యం బోనస్ చెల్లించనుందని ఫెర్రోస్క్రాప్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల బోనస్ తదితర అంశాలపై ఇటీవల ఒప్పందం జరిగిందన్నారు. ఒక్కో ఉద్యోగికి రూ.23 వేల బోనస్‌తో పాటు మెడికల్ ఇన్సూరెన్స్‌తో పాటు నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) అమలు చేస్తారని చెప్పారు. కార్మికులకు నైట్ షిఫ్ట్ అలవెన్స్ రోజుకు రూ.150 చెల్లిస్తారన్నారు. కార్మికులకు అత్యవసర వైద్యం కిమ్స్‌లో అందజేయనున్నారన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధానకార్యదర్శి ఎం. అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవోఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలి



ఆందోళన చేస్తున్న ఉక్కుసిటు నాయకులు, కార్మికులు

ఉక్కునగరం: ఈవోఐ పేరుతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మడం ఆపేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ఉక్కు సిటు ఆధ్వర్యంలో ఉక్కు జంక్షన్‌లో ఈనెల 11న నిర్వహించతలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు జీతాలు చెల్లించకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. ఓ వైపు కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తూ మరోపక్క ఉక్కు మంత్రి అసత్యాలు వల్లెవేస్తున్నారన్నారు. యాజమాన్యం స్పందించి జీతాలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీటూ కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు పి.శ్రీనివాస్‌రాజు, వై.టి.దాస్, పుల్లారావు, శ్రీనివాస్‌రెడ్డి, రామశేఖర్ పాల్గొన్నారు.

149 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అగనంపూడి: నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీ లేమర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.రత్నకుమార్ అన్నారు. లేమర్తి హైస్కూల్ విద్యార్థులకు కేర్ విజన్ నేత్ర వైద్యులు కుచర్లపాటి శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే టీవీలు, సెల్ ఫోన్లు ఎక్కువగా చూడడం, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల కంటి సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. 149 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా వీరిలో 19 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో వికాస్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కేజే నాయుడు, నాయకులు బి.సత్యనారాయణ, కె.హనుమంతురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో ఉక్కు ఉద్యోగి ప్రతిభ



రమణకు పతకం, ప్రశంసా పత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం చార్జ్‌మెన్ ఎస్.వి.రమణ గత నెలలో విశాఖలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుపొందారు. తద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 6,7 తేదీల్లో ద్వారకా తిరుమలలో రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. 35–45 కేటగిరీలో పాల్గొన్న రమణ ప్రతిభ కనబరిచి రజత పతకం గెలుపొందారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వర్మ, ప్రధానకార్యదర్శి అవినాష్, జిల్లా కార్యదర్శి రామారావు చేతుల మీదుగా పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. తద్వారా జాతీయ పోటీలకు అర్హత సాధించారు.

ప్రతి వార్డులో బూత్ ఏజెంట్ల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: నియోజకవర్గంలో పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు బోడి వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో బూత్ కమిటీ ఏజెంట్లను నియమించాలని సూచించారు. ప్రతి నెలా బూత్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి, పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వార్డు అధ్యక్షులు భూపతిరాజు శ్రీనివాసరాజు, ధర్మాల శ్రీనివాసరావు, పూర్ణానంద శర్మ, మహాలక్ష్మినాయుడు, పల్లా సురేష్, మంత్రి శంకరనారాయణ, కొణతాల రాము, చేగొటి శ్రీనివాస్, కోమటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

అగనంపూడి: అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు యూనియన్ బ్యాంక్ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ కోరారు. యూనియన్ బ్యాంక్ నిఘా అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆస్పత్రి ఆవరణలో యూబీఐ సీనియర్ మేనేజర్ సుధారాణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విశాఖ జిల్లాలోనే 564 బ్రాంచ్‌లు ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషి రూప, లలిత, రేష్మా, ఆస్పత్రి పరిపాలనాధికారి రవిరాజు, బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రామకోటి, ప్రజా సంఘాల ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న సుధారాణి

అక్షర జ్ఞానంతో సంపూర్ణ వెలుగు

పెదగంట్యాడ: అక్షర జ్ఞానంతో సమాజంలో సంపూర్ణ వెలుగులు ప్రసరితమవుతాయని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం నడుపూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ, సిబ్బంది మాధవి, సూర్యకుమారి పాల్గొన్నారు.

జీఎస్టీ తొలగింపుతో అన్ని వర్గాలకు మేలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

గాజువాక: నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుతో కలిసి ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు ప్రయోజనం కలిగేలా పన్నులను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, సురేష్, కృష్ణంరాజు, గొర్లె సత్యనారాయణ, సిరసపల్లి నూకరాజు, పొలిమేర శ్రీనివాస్, రోహిణి, భువనేశ్వరి, సోంబాబు, ప్రకాష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న మాధవ్

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలు రమణకుమారిని సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు రమణకుమారిని కుమారిని సోమవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

స్పీచ్ టెక్నాలజీ, సిగ్నల్ ప్రాసెసింగ్‌కు డిమాండ్

అగనంపూడి: ప్రస్తుతం స్పీచ్ టెక్నాలజీ, సిగ్నల్ ప్రాసెసింగ్ వ్యవస్థలకు డిమాండ్ ఉందని ఎన్‌ఎస్‌టీఎల్ సైంటిస్ట్ చెల్లంనాయుడు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సిగ్నల్ ప్రాసెసింగ్ – బేసిక్స్ ఆఫ్ స్పీచ్ ప్రొడక్షన్ అంశాలపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఈ రెండు అంశాలు వివిధ రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్లు కె.మధుసూదనరావు, బొడే ప్రసాద్, సమన్వయకర్త నాగజ్యోతి పాల్గొన్నారు.

ఉక్కు విషయంలో ఎంపీ, ఎమ్మెల్యే దుష్ప్రచారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

- కార్మికుల పోరాటాలకు అడ్డుపుల్ల
- కూటమికంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మేలు
- ప్లాంట్ పరిరక్షణ కోరుతూ 11న బహిరంగ సభ
- సీపీఎం నాయకుల వెల్లడి

గాజువాక: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూర్తిగా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని ఒకపక్క మోదీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా చెబుతుంటే ఈ కంపెనీని కాపాడేశామంటూ ఎంపీ, ఎమ్మెల్యే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈవోఐ పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారని, దీనికి వ్యతిరేకంగా ఈనెల 11న గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. బహిరంగ సభ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ బయట ఆర్‌ఐఎన్‌ఎల్ బోర్డు ఉంటుందని, ఈవోఐ పేరుతో ప్లాంట్ లోపల డిపార్ట్‌మెంట్లను ప్రైవేటుపరం చేయనున్నారని అన్నారు. దీని కోసం ఈనెల 9లోగా బిడ్లు వేయాలని ప్రకటనలు ఇచ్చారని, ప్లాంట్‌ను 46 ముక్కలుగా అమ్మాలని నిర్ణయించారని తెలిపారు. ఈ ప్రక్రియ సజావుగా సాగిపోతే తరువాత దశలో మొత్తం ప్లాంట్‌ను తమ అనుకూల పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలనే కుట్ర జరుగుతోందన్నారు. ప్లాంట్‌ను వారు కాపాడిందే నిజమైతే ప్రైవేటీకరించడంలేదని కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణకు, ఉద్యమాల విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కార్మికులకు ఎంతోకొంత అనుకూలంగా నడిచిందన్నారు. సీఐటీయూ జాతీయ నాయకుడు ఎన్.రామారావు మాట్లాడుతూ 11న గాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర పోలీసులను ప్లాంట్ లోపల విభాగాల్లోకి పంపించి కార్మికులను తీవ్రంగా బెదిరించిందన్నారు. నాయకులకు షోకాజ్ నోటీసులిచ్చారని, సస్పెండ్ చేశారని, అరెస్టు కూడా చేశారని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, బంగారు నాయుడు, ఎ.లోకేష్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



కుమారస్వామి, అరుణ దంపతులను సత్కరిస్తున్న ఇస్లాంపేట పాఠశాల సిబ్బంది

పెదగంట్యాడ: నిరంతరం విద్యార్థులతో మమేకమై, వారి మనసుల్లో సుస్థిర స్థానం దక్కించుకున్న ఉపాధ్యాయులు ధన్యులని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గేదెల ప్రమీల అన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు జి.కుమారస్వామి అరుణ దంపతులను సోమవారం ఇస్లాంపేట హైస్కూల్‌లో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమార స్వామి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగపడే వెబ్‌సైట్ నిర్వహిస్తూ నిరంతరం సేవలో తరిస్తున్నారన్నారు. అవార్డు గ్రహీత కుమారస్వామి మాట్లాడుతూ వృత్తి ధర్మాన్ని కాపాడుతూ, విద్యార్థులకు మెరుగైన బోధన చేయడానికి తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందరావు, డీఎస్ మూర్తి, రమాదేవి, హేమలత, రామలక్ష్మి, ఆశాలత, శారద, నాగరత్నం, నసీమా బేగమ్, సాజిదా బేగం, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.